గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం

- రోడ్లపైనే చెత్తా చెదారాలు
- కాలువల్లో పేరుకపోయిన మురుగునీరు
- పట్టించుకోని అధికారులు


రాయలాపురం కాలువల్లో నిలిచిన మురుగునీరు


మల్లికార్జునపురం రోడ్డుపై పడి ఉన్న చెత్తా చెదారాలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని మల్లికార్జునపురం, ఎర్రబల్లె, కొత్తపల్లె, మోట్నూతలపల్లె, రాయలాపురం గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. రోడ్లపైనే చెత్తా చెదారాలు ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులెవరూ గ్రామాలవైపు కన్నెత్తి చూడటంలేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు ఉన్నప్పటికి రోడ్లపైనే కుప్పలు, కుప్పలుగా చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి. అలాగే మురుగు నీటి కాలువలను కూడా పట్టించుకునేవారు లేకపోవడంతో మురుగునీరు కాలువల్లో నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులెవరూ పారిశుద్ధ్య పనులను పట్టించుకోకపోవడంతోపాటు బ్లీచింగ్ పౌడర్‌ను కూడా చల్లడంలేదు. మురుగునీరు నిల్వ ఉండటంవల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులకు గురై రోగాల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు కానీ, మండలస్థాయి అధికారులు కానీ గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టడంలేదు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రతి ఇంటిలోనూ జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడంలేదు



గ్రామాల్లో ఎక్కడ చూసినా మురుగునీరు, చెత్తా చెదారాలు రోడ్లపైనే పడి ఉన్నాయి. సంబంధిత అధికారులెవరూ గ్రామాల్లో పర్యటించడంలేదు. దీంతో పారిశుద్ధ్యం పనులు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో కూడా మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి.

– వెంకటలక్షుమ్మ, స్థానికురాలు, వెలమవారిపల్లె

క్లుప్తంగా

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు చేస్తున్న మే ఐ హెల్ప్‌యు సభ్యులు

జమ్మలమడుగు : అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తూ మేఐహెల్ప్‌యు సభ్యులు మానవత్వాన్ని చాటుకుంటున్నారు. మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో నివాసం ఉంటున్న 90 సంవత్సరాల వృద్ధురాలు రామనాయకమ్మ అనారోగ్యంతో మరణించింది. అంతిమ సంస్కారానికి బంధువులు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో స్థానికులు మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ అధ్యక్షుడు లక్ష్మన్‌మోరెకు తెలిపారు. అతను తన సభ్యులతో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో సుభహాన్, అహమ్మద్, కృష్ణా, వెంకటలక్షుమ్మ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న వరిపంట


అద్దాలమర్రి వద్ద పడి పోయిన వరిపంట

చక్రాయపేట : రెండు రోజులుగా పడిన వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో వరిపంట దెబ్బతింది. మండల వ్యాప్తంగా సుమారు 803 హెక్టార్లలో రైతులు వరి పంట సాగు చేశారు. అయితే వరినాట్ల సమయంలో వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో రైతులు సాగు చేసిన వరిపంట నేడు వివిధ దశల్లో ఉంది. ప్రస్తుతం కోతకు వచ్చిన పంటతో పాటు వెన్ను దశలో ఉన్న పంట వర్షానికి దెబ్బతిందని అద్దాలమర్రికి చెందిన వేముల సుదాకర్ అనే రైతు వాపోయాడు. ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ


గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ, తదితరులు

సింహాద్రిపురం : మండలంలోని కసునూరు గ్రామంలో గురువారం గోకులం షెడ్డు నిర్మాణానికి ఎంపీడీవో కృష్ణమూర్తి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పండుగ వారోత్సవాల భాగంలో గోకుల షెడ్డు నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీసీ మండల సూపర్‌వైజర్ వసంత, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.

22 నుంచి మొబైల్ ఆధార్ సెంటర్లు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం, ఎల్లారెడ్డిపల్లె గ్రామ సచివాలయాలలో ఈనెల 22వ తేదీ నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఆధార్ కేంద్రాలలో 0–5 సం. చిన్నాలకు ఆధార్ అప్‌డేట్ చేయడం, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు చేయడం, ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేయడం, వేలిముద్రలు అప్‌డేట్ చేయడం తదితర సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

తప్పల సవరణకు చివరి అవకాశం

పెద్దముడియం : రైతులు సాగు చేసిన పంట వివరాలను రైతు సేవా కేంద్రంలో ముసాయిదా జాబితా ప్రదర్శించామని ఇ పంటలో ఏవైనా తప్పులు సవరణలు చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం అని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. గురువారం మండలంలోని భీమగుండం గ్రామంలో ఇ పంట నమోదుపై గ్రామ సభను ఏర్పాటు చేసి మాట్లాడారు. జాబితాలో ఏవైనా సందేహాలు ఉంటే ఫిర్యాదు చేయాలని తెలిపారు. పంట సాగు లేకున్న, ఇతర వివరాలు తప్పుగ నమోదు చేసిన స్థానిక రైతు సేవా కేంద్రంలో ఫిర్యాదు చేసిన వాటిని సరిచేసి తుది జాబితాను రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి


రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించిన ఇ-క్రాప్ నమోదు జాబితాను పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

లింగాల : ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. గురువారం లింగాల రైతు సేవా కేంద్రంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇవ్వని సందర్భాల్లో సమాచార అధికారిపై జరిమానా, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకోవడం ప్రజల హక్కు అన్నారు. సమాచార హక్కు చట్ట ప్రకారం కోరిన సమచారం అందుబాటులో లేకుంటే సంబంధిత శాఖ అధికారులకు ఆ దరఖాస్తును బదలాయించవచ్చునన్నారు. రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ –2024 ఇ–క్రాఫ్ పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కొరకు ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది రాణి, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు, రైతు సేవా కేంద్రాల సహాయకులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకోవడం ప్రజల హక్కు అన్నారు. సమాచార హక్కు చట్టం సెక్షన్ 6.7(1)ప్రకారం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని అలా చేసుకున్న వ్యక్తులకు సంబంధిత అధికారులు 30 రోజుల్లోపు వారు కోరుకున్న సమాచారాన్ని పూర్తిస్థాయిలో అందించాలన్నారు. దరఖాస్తు దారులకు సమాచారం ఇవ్వకపోతే సంబంధిత అధికారిపై కేసులు కూడా నమోదు చేయ్యొచ్చునన్నారు. ఈ చట్టాని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సహాయకులు రైతులు పాల్గొన్నారు.

కాలనీని చుట్టుముట్టిన వర్షం నీరు


సుందరయ్య కాలనీలో వర్షం నీటితో నిండిన రోడ్డు


కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ శేషఫణీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని సుందరయ్యకాలనీలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టులో ఉన్న ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. దీంతో కాలనీ వాసులు రాత్రంతా జగారం చేయాల్సి వచ్చిందని కాలనీ వాసులు తెలిపారు. ఇళ్లలోని నిత్యావసర సరుకులు తడిసిపోయి ఇబ్బందులు పడినట్లు వారు తెలిపారు. డ్రైనేజీలలోని నీరంత రోడ్లపైకి రావడంతో దుర్వాసన వస్తోందన్నారు. ఈ విషయంను స్థానికులు మున్సిపల్ కమిషనర్ శేషఫణికి తెలియజేశారు. వెంటనే ఆయన సుందరయ్య కాలనీలో పర్యటించి రోడ్లపైన నిలిచి ఉన్న నీటిని ట్యాంకర్ల సాయంతో తీయించారు. నీరు తగ్గిన తర్వాత వ్యాధులు సంక్రమించకుండా వైద్య బృందం చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

శిక్షణ తరగతులను స్కూల్ కాంప్లెక్స్‌లో నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల్లో 1, 2వ తరగతుల బోధనపై నిర్వహించే ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులను పాఠశాల కాంప్లెక్స్‌లోనే నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడప జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులను అక్టోబర్ 21వ తేదీనుంచి 26వ తేదీ వరకు ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేయునట్లు జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. ఈ రెసిడెన్షియల్ శిక్షణతో ఏకోపాధ్యాయ పాఠశాలలో విద్యార్థులు బోధనకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. మహిళా, అనారోగ్య సమస్యలున్న, చిన్న పిల్లలున్న ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణలో పాల్గొనడం ఇబ్బందిగా ఉందన్నారు. రెసిడెన్షియల్ పద్ధతి రద్దుచేసి స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

బహిరంగ మద్యపానం చేసే ప్రాంతాలు శుభ్రం


షాదీఖాన వద్ద అపరిశుభ్రంగా ఉన్న బహిరంగ మద్యపాన స్థలాన్ని శుభ్రం చేస్తున్న పోలీస్ సిబ్బంది

కమలాపురం : మండలంలో బహిరంగ మద్యపానం సేవించే పలు ప్రదేశాలను గుర్తించి పోలీసులు శుభ్రం చేశారు. గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కమలాపురం సీఐ ఎస్కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిల పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది పట్టణ పరిధిలోని షాదీఖాన, రైల్వేస్టేషన్, పుత్తా కాలేజీ, గఫార్ పెట్రోల్ బంక్, కోగటం రోడ్డు, క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాలను శుభ్రం చేశారు. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కమలాపురం పట్టణంలో బహిరంగ మద్యపానం చేసే 14 ప్రాంతాలను గుర్తించామని, వాటిని జేసీబీ, డోజర్ ద్వారా శుభ్రం చేశామన్నారు. ఇకపై ఆ ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఈ ప్రాంతాలను యువకులు షటిల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు ఆడుకునే విధంగా సిద్ధం చేస్తామన్నారు. శుభ్రం చేసిన అనంతరం యువతతో కలసి సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది వాలీబాల్ ఆడారు. పోలీసుల పనితీరు పట్ల పట్టణ ప్రజలు, యువత హర్షం వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు


తొండూరు మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రం

తొండూరు : లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంవల్ల నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం చెత్త సంపద తయారీ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. తొండూరు మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఆయా గ్రామాల్లోని వీధులు, ఇళ్లలో చెత్తను సేకరించడానికి పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం వాహనాలు, ట్రైసైకిళ్లను మంజూరు చేసింది.

వాటి ద్వారా గ్రామాల్లో చెత్తను సేకరించి కేంద్రాల్లో కంపోస్టు ఎరువులు తయారుచేసి రైతులకు విక్రయించాల్సి ఉంది. గ్రామాల్లో వర్మీ కంపోస్టులకు మంచి డిమాండ్ ఉంది. అయినా వాటిని అమలు చేయడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ వహించాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గండి భారతి


మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపాలని ఎంపీపీ గండి భారతి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రజా సమస్యలను ప్రస్తావించారు. భారీ వర్షాలు కురుస్తున్నాయని, వాగులు, వంకల ఉధృతి వలన ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులంతా నిత్యం అప్రమత్తంగా ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే విద్యుత్, మంచి నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ జ్యోతి మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన సమస్యలను పరిష్కరించాలని, అలా చేయకుంటే సమావేశాలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపిస్తుండగా వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ 25 శాతం సబ్సిడీతో ఇస్తున్న శనగల ధరలు బహిరంగ మార్కెట్ కంటే అధికంగా ఉండటంతో రైతులు తీసుకోవడం లేదని, సబ్సిడీ పెంచేందుకు జిల్లా అధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు విద్యుత్ చార్జీలకు జమ చేశారని, అలాగే ఏకగ్రీవ పంచాయతీలకు రావాల్సిన నిధులు కూడా రాలేదని, ఇక ఏడాదిలో తమ పదవీకాలం ముగిసి పోతుందని, తాము ఎలాంటి అభివృద్ధి చేయలేక పోయామని సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంటలలో మెళకువలు పాటించాలి


మినుము పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : మూడు రోజులుగా కురుస్తున్న వానలకు పంటలు తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకోవడంలో మెళకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. గురువా రం మండలంలోని గోనుమాకులపల్లెలో మినుము, పెసర పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వర్షాలు అధికంగా కురుస్తుండటం వలన పొలాల్లో నీరు నిచి ఉండటం అంతే కాకుండా గాలిలో తేమ శాతం పెరగడం వలన పంటలపై చీడ పీడల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. భూమిలోని పోషకాలు సరిగ్గా మొక్కలకు అందక ఎదుగుదల ఆగిపోవడం జరుగుతందన్నారు. విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తకుండా కుళ్లిపోయే ప్రమాదం కూడా ఉంటుందని సూచించారు. పొలంలో నీరు అధికంగా ఉన్నట్లయితే వెంటనే బయ టి పంపించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమర్థవంతంగా పంట కోలుకోవడానికి 20 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వానలు పూర్తిగా తగ్గిన తరువాత 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయాలన్నారు. అంతే కాకుండా వేరుకుళ్లు తెగులు మరియు ఆకుమచ్చ వ్యాధులనుంచి కాపాడుకొనేందుకు హెక్సా కొనజోల్ 2 మి.లీ లేదా ప్రోపికొనజోల్ 1మి, లి లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కాయ తొలుచు పురుగు నివారణకు వర్షం కురిసిన వారం రోజుల తరువాత క్లోరిపైరిపాస్ 2.5మి.లీ, లేదా నోవాల్యురాన్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్

పులివెందుల టౌన్ : పట్టణంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి ఘనంగా జరిగింది. పట్టణంలోని కదిరి రోడ్డులో వాల్మీకి విగ్రహాన్ని వాల్మీకులందరూ కలిసి ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అలాగే మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి టెంకాయలు కొట్టి వాల్మీకి మహర్షిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు అంబకపల్లె నారాయణ స్వామి, బాలుడు, మేకల విశ్వనాథ్, దాసరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో :

వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్‌లు హాజరై వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

లింగాల : మండలంలోని పార్నపల్లె గ్రామంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్నపల్లె గ్రామంలోని వాల్మీకులు వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు.

ఉల్లి పంట పరిశీలన


ఉల్లిపంటను పరిశీలించి రైతులకు సూచనలు అందిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణీ


చింతకొమ్మదిన్నెలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాధికారులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిర్రాజుపల్లి, దండుపల్లి, తిప్పలూరు గ్రామాలలో సాగు చేసిన ఉల్లి పంటను గురువారం జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఉల్లి పంట కోతదశలో ఉండి మురుగునీటిని బయటకు పంపాలని, గడ్డలను పీకిన తర్వాత కార్బెండిగామ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దీంతో గడ్డలు కుళ్ల కుండా నివారించవచ్చున్నారు. వీలైనంత త్వరగా గడ్డలను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి నిల్వ ఉంచి మార్కెటింగ్ చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రెడ్డెయ్య, సహాయక సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

చింతకొమ్మదిన్నె(వల్లూరు) : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట అకాల వర్షాలకు నేలకొరగడంతో వాటిని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు గురువారం పరిశీలించి మాట్లాడారు. వర్షపు నీరు నిలిచిన వరి పంటల్లో నుంచి నీటిని బయటకు పంపి వాలిన వరిని నిలబడే విధంగా చేసుకోవాలన్నారు. వర్షాల వల్లన తెగుళ్ళు వచ్చే అవకాశం ఉందన్నారు. వాటికి అవసరమైన మందులను పిచ్చికారి చేయాలన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ

లింగాల : మండలంలోని బోనాల, పార్నపల్లె పంచాయతీల్లోని గ్రామాల్లో గురువారం మండల అధికారులు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. బోనాలలో రెండు రోడ్లకు రూ.2.16లక్షలు, పార్నపల్లెలో ఒక రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ గంగరాజు పాల్గొన్నారు.

తప్పొప్పులుంటే ఆడిట్‌లో తెలపండి


మాట్లాడుతున్న ఏఓ శివమోహన్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో రైతులు వేసిన పంటల ఇ–క్రాఫ్ నమోదు జాబితాను ప్రదర్శించడం జరిగిందని.. వీటిలో ఏవైనా తప్పులుంటే ఆడిట్‌లో తెలపాలని ఏఓ శివమోహన్‌రెడ్డి రైతులకు తెలిపారు. గురువారం మండలంలోని అంకాలమ్మగూడూరు గ్రామంలో రైతులకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీహెచ్ఏలు నిర్వహించిన ఇ–క్రాప్ నమోదులో తప్పులు, ఏవైనా సమస్యలుంటే తమకు తెలపాలని రైతులకు సూచించారు.

భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు


ఎన్ పాలగిరి క్రాస్ వద్ద ప్రత్యేక పూజలందుకుంటున్న కాశిరెడ్డి నాయన

వీరపునాయునిపల్లె : సంగాలపల్లె గ్రామంలోని శ్రీ శివకృష్ణ గోశాల, ఎన్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయం, కాశిరెడ్డినాయన ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాశిరెడ్డినాయన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాళాల భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకొంది. సంగాలపల్లె గోశాలలో గోమాతలకు పూజలు నిర్వహించారు.

ఘనంగా పౌర్ణమి దీపోత్సవం


దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తి, ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి చౌడేశ్వరీ మాతకు విశేష పూజలను నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


గండి కోదండరామాలయంలో పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

చక్రాయపేట : గండి క్షేత్రంలోని కోదండ రామాలయంలో గురువారం నూతనంగా ధ్వజ స్తంభ, గణపతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల పూజ, గరుపూజ, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, తీర్థ ప్రాసాద వినియోగం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు రాము శర్మ, నరసప్ప, రాజారమేష్, రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ఈవేడుకలను నిర్వహించినట్లు కోదండ రామాలయ కమిటీ సభ్యులు సాధువిశ్వనాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డిలు తెలిపారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామిగుప్త పాల్గొన్నట్లు వారు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయ వర్ధంతి

సింహాద్రిపురం : బుడ్డయ్యపాలెం ప్రాంగణంలో గురువారం శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు తుపాకుల రాఘవేంద్ర ఆధ్వర్యంలో బలిజ సంఘ ఉపాధ్యక్షుడు తుపాకుల శ్రీనివాసులు, నాయకులు శ్రీకృష్ణదేవరాయ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో శ్రీకృష్ణదేవరాయలు ఒక్కడిగా పేరు గాంచారన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణదేవరాయ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు